క్లుప్తంగా

వసతి గృహాల పరిశీలన



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయమూర్తి కె.ప్రత్యూష కుమారి గురువారం నగరంలోని పలు వసతి గృహాలను, పాఠశాలలను పరిశీలించారు. స్థానిక వై.జంక్షన్‌లో ఉన్న షాడే ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల్లోని విద్యార్థులతో మాట్లాడారు. వారికి మంచి, చెడుస్పర్శలపై అవగాహన కల్పించారు. పిల్లల సంరక్షణ, సంక్షేమం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదేనని స్పష్టం చేశారు. అనంతరం వై.జంక్షన్‌లో ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్, గణేష్‌చౌక్‌లో ఉన్న బీసీ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌ను, ఎస్సీ వసతిగృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందించే సురక్షిత తాగునీరు, ఆహారం విషయంలో అప్రమత్తంగా ఉండాలని వసతిగృహ అధికారులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టల్ ప్రాంగణంలో అవసరమైన మరమ్మతులను ఎప్పటికప్పుడు చేయించాలని సూచించారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తురాలికి చందన భరోసా



రమ్యను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: కిడ్నీల వ్యాధితో బాధపడుతున్న వేమగిరికి చెందిన పదేళ్ల రమ్యకు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ భరోసా కల్పించారు. గురువారం ఆయన వేమగిరి-3 సచివాలయం పరిధిలో నివసిస్తున్న రమ్య ఇంటికి వెళ్లి బాలిక తండ్రి దుర్గా ప్రసాద్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ రమ్యకు అవసరమైన మందులను అందజేస్తానని హామీ ఇచ్చారు. అలాగే డయాలసిస్ పేషెంట్ అయినందున నెలకు రూ.10 వేల పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, సురేష్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో డాక్టర్ బాపిరాజు



డాక్టర్ బాపిరాజు

కంబాలచెరువు: ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ డాక్టర్ పుప్పాల బాపిరాజు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికయ్యారు. గురువారం ఆయన ఈ వివరాలు తెలిపారు. సందేశాత్మక చిత్రాలు, స్ఫూర్తిదాయక చిత్రాలతో విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంచుతున్న బాపిరాజుకు సంస్థ వ్యవస్థాపకుడు కె.ఎల్లేష్ కుమార్ ఈ పురస్కారానికి ఎంపిక చేశారన్నారు. పురస్కారం అందుకున్న ఆయనను డీవైఈఓ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈఓ2 రమారజని, ఎస్‌కేవీటీ స్కూల్ హెచ్‌ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, వరహాగిరి కృష్ణమోహన్, నరసింహారావు, వీర్రాజు తదితరులు అభినందించారు.

5,113 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 25వ రోజు గురువారం జిల్లావ్యాప్తంగా 10 వైద్య శిబిరాలు నిర్వహించినట్టు డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డా.మౌనిక తెలిపారు. వీటిలో 5,113 మంది రోగులు వైద్య సేవలు పొందగా, 89 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేశామని వారు తెలిపారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పట్టుదలతో తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. బూత్ కన్వీనర్లు రోజుకు 20 కుటుంబాలను కలిసి మినీ మేనిఫెస్టోలో అంశాలను వివరించాలన్నారు. గురువారం మోరంపూడి శుభమస్తు కల్యాణ మండపంలో రూరల్ నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా గోరంట్లతో పాటు నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, జోన్-2 కోఆర్డినేటర్ మందలపు రవి, రాష్ట్ర నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, కాశీ నవీన్‌కుమార్ హాజరయ్యారు. చంద్రబాబుకు బెయిల్ రావడంతో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు.

ఫలం స్వీటు.. ధర హాటు

- సీతాఫలం ఎట్ ద రేట్ రూ.70
- దిగుబడి తగ్గడమే కారణం

రాజానగరం: రుచిలో సిమ్లా యాపిల్‌ని తలదన్నే ఫలం సీతాఫలం. ప్రస్తుతం మార్కెట్‌లో దీనికి పలుకుతున్న ధర కొనుగోలుదారులను హడలెత్తిస్తోంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఒక్కో ఫలం ధర రూ.70 పైమాటే. దీనితో సీజన్‌లో వీటి రుచి చూడాలనే ఆశతో కొనాలనుకునే సామాన్యులకు ఇది అందని ఫలమైంది. మెట్ట ప్రాంతంగా పిలిచే చాగల్నాడు ఏరియాలో పండే సీతాఫలాలు రుచిలోనే కాదు ఆకారంలో కూడా ఆకట్టుకునే విధంగా నిగనిగలాడుతుంటాయి. అందుకనే వీటికి దేశ రాజధాని ఢిల్లీలో సైతం మంచి పేరుంది. రాజకీయ ప్రముఖులతో పని ఉన్న వ్యక్తులు కొందరు వీటిని కానుకగా అందజేయడం ద్వారా వీటికి ఈ ఖ్యాతి లభించింది. ఇదంతా ఒకప్పటి మాట, నేడు ఈ ఫలాలు దొరకడమే గగనంగా మారింది.

కనుమరుగవుతున్న తోటలు

రియల్ ఎస్టేట్ ప్రభావంతో చాగల్నాడు ప్రాంతంలో ఇతర పండ్లతో పాటు సీతాఫలాల తోటలు కూడా కనుమరుగవుతున్నాయి. ఈ క్రమంలో 15



చాగల్నాడు సీతాఫలాలు

ఏళ్ల క్రితం వంద ఫలాలు రూ.50 నుంచి రూ.వందకు లభించేవి. తోటలు తగ్గిపోవడంతో ఫలాల దిగుబడి గణనీయంగా క్షీణించింది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. చాగల్నాడు సీతాఫలాలు సాధారణంగా దసరా రోజుల్లో మార్కెట్‌కి వస్తుంటాయి. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో కాస్త ఆలస్యమై, ప్రస్తుతం మార్కెట్‌ని అలరిస్తున్నాయి.

తోటల్లోనే కొనుగోళ్లు

చాగల్నాడు సీతాఫలాలకు రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకు జాతీయ రహదారి పొడవునా మార్కెట్‌గా ఉంటుంది. ప్రస్తుతం వీటి దిగుబడి చాలావరకు తగ్గిపోవడంతో తోటలకే పోయి, అక్కడే నేరుగా కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో అడపాదడపా మార్కెట్ వచ్చే ఫలాలు కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. సీతాఫలాలను వ్యాపారులు డజను, పాతిక చొప్పున విక్రయిస్తున్నారు. కాస్త పెద్ద సైజు ఉన్న ఫలాలు డజను రూ.1,800 రేటు పలుకుతోంది. ఈ లెక్కన వంద ఫలాల ధర రూ.7,200గా ఉంది. విడిగా కొనాలంటే ఒక్కటీ రూ.70 పైబడి చెల్లించాల్సిందే. కాయల సైజు తగ్గితే రేటు తగ్గుతుంది మినహా లేకుండా తగ్గేదేలే.. అన్నట్టుగా చాగల్నాడు సీతాఫలాల మార్కెట్ పరిస్థితి ఉంది. ఇది కూడా వారం పాటు ఉంటుందని, ఆ తర్వాత చాగల్నాడు సీతాఫలాల దిగుబడే ఉండదంటున్నారు వ్యాపారులు.



జాతీయ రహదారి వెంబడి ఉన్న సీతాఫలాల దుకాణాలు

పేదలకు 'ఆరోగ్య సురక్ష' ఓ వరం

ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. గురువారం వేమగిరి-3 సచివాలయం పరిధిలోని జక్కంపూడినగర్ ఎంపీపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల గడప వద్దకు వైద్యాన్ని చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని చెప్పారు. ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు, పెద్ద ఆస్పత్రుల్లో చికిత్స అందించే సదుపాయాన్ని గతంలో ఏ ముఖ్యమంత్రి కల్పించలేదన్నారు. పేదల పక్షపాతిగా, సంక్షేమ సారథిగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డా.అనసూరి పద్మలత మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. వైద్య నిపుణులు ఆశానిర్మల, కల్యాణ్, పీహెచ్‌సీ వైద్యులు నాగసాయిమౌర్య, స్వరూప, జెస్సీసుప్రియ సేవలందించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ కె.రాజేష్ నేత్ర పరీక్షలు నిర్వహించారు. మొత్తం 569 మంది వైద్య సేవలు పొందారు. ముగ్గురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి, ఈఓపీఆర్డీ వాణి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, మాజీ సర్పంచ్ డా.వెలుగుబంటి వెంకటాచలం, సచివాలయ కన్వీనర్లు బయ్యారపు నాగేశ్వరరావు, కట్టా జమీందార్, విప్పర్తి ఫణికుమార్, కట్టా శ్రీరామ్, పితాని హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వేమగిరి వైద్య శిబిరంలో వృద్ధుడికి కళ్లజోడు పెడుతున్న చందన నాగేశ్వర్

ప్రజల ఆరోగ్యానికి సీఎం జగన్ భరోసా

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించారని చందన నాగేశ్వర్ అన్నారు. గురువారం బొమ్మూరు-1 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం స్థానిక ఏఎంజీ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ శిబిరాన్ని సచివాలయ కన్వీనర్లతో కలిసి చందన నాగేశ్వర్ ప్రారంభించారు. వైద్యం ఖరీదైన పరిస్థితిల్లో పేదలకు చేరువ చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. వైద్యులు రమేష్, హేమ, మాన్సీ, సత్య, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, వైద్యులు జి.రోహిత, ఈ.నాగదేవి వైద్య సేవలందించారు. మొత్తం 613 మంది సేవలు పొందగా, 16 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. చందన చేయూత ట్రస్టు తరఫున చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో శిబిరానికి వచ్చిన వారికి ఉచిత భోజన ఏర్పాట్లు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీరాణి పర్యవేక్షణలో అంగనవాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, పార్టీ గ్రామ అధ్యక్షుడు యెనుముల త్యాగరాజు, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, సచివాలయాల కన్వీనర్లు ఎలుగొండ లక్ష్మి, మత్సేటి శివ, సోమన శ్రీనివాసరావు, తోడేటి రాజా, కాకులపాటికుమార్, పెయ్యల రాజేష్, ఎం.రమేష్, కొమ్మన కోటి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

ప్రజలకు నాణ్యమైన వైద్యం

కంబాలచెరువు: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఒక వరమని వైఎస్సార్ సీపీ రాజమండ్రి సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక తాడితోటలో యూపీహెచ్‌సీలో జరిగిన ఈ వైద్య శిబిరంలో గురువారం ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్టు వివరించారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. కార్యక్రమంలో 14వ డివిజన్ ఇన్‌చార్జి, క్లస్టర్ ప్రెసిడెంట్ పెంకే సురేష్, మాజీ కార్పొరేటర్ బాపన సుధారాణి, పార్టీ మైనారిటీ సెల్ నగర అధ్యక్షుడు మొహమ్మద్ అరిపుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణం

సుబ్రహ్మణ్య మైదానం అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీ భరత్‌రామ్



పనులు పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: చారిత్రాత్మకమైన బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానం, వేంకటేశ్వర ఆనం కళాకేంద్రాలను అత్యంత శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నట్టు వైఎస్సార్ సీపీ నేత, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ తెలిపారు. గురువారం సుబ్రహ్మణ్య మైదానంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ నగరంలో సుబ్రహ్మణ్య మైదానికి చారిత్రక ప్రాధాన్యం ఉందన్నారు. ఆ ఆనవాళ్లు చెక్కుచెదరకుండా, మిగిలిన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ.. గత వైభవానికి మెరుగులు దిద్దుతున్నామని వివరించారు. భవిష్యత్తు తరాల వారు గత వైభవాన్ని స్మరించుకునేలా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా సుబ్రహ్మణ్య మైదానంలో వేదికను మరింత విస్తరిస్తున్నామని, ఆరుబయట కూర్చునే ప్రేక్షకులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటిని ప్రత్యేకాభివృద్ధి నిధులు రూ.6 కోట్లతో చేపట్టినట్టు తెలిపారు. కమిషనర్ దినేష్‌కుమార్ ప్రత్యేక పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం సుబ్రహ్మణ్య మైదానంలో ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఆనం కళాకేంద్రంలో కూడా ఇవే నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.

ఎస్ఈఏ సర్వేపై సమావేశం

కడియం: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్(ఎస్ఈఏ) సర్వేతో గుణాత్మక విద్యను అందించే ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలని ఎంఈఓ వి.లజపతిరాయ్ అన్నారు. గురువారం కడియం మండల విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై హెచ్‌ఎంలు, ఫీల్డ్ ఇన్విజిలేటర్లకు సమావేశం నిర్వహించారు. విద్యా వ్యవస్థ బలాలు, బలహీనతలు అంచనా వేయడం ద్వారా ఉపాధ్యాయుల వృత్తిపరమైన ఎదుగుదలకు ఈ సర్వే ఉపయోగపడుతుందని వివరించారు. సర్వే అబ్జర్వర్, డైట్ లెక్చరర్ కె.గంగాధరరావు సర్వే మెటీరియల్‌ను ఆయా పాఠశాలలకు అందజేశారు. ఎంపికైన పాఠశాల ల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులు అభ్యసన లక్ష్యాలను చేరుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఎంఈఓ-2 వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృతంగా కార్డన్ సెర్చ్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అసాంఘిక శక్తులు, కార్యకలాపాలపై అడ్డుకట్టవేసేందుకు లాఅండ్‌ఆర్డర్, ఎస్ఈబీ, స్పెషల్ పార్టీ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి జిల్లాలో గురువారం తెల్లవారుజాము నుంచి 12 ప్రాంతాల్లో కార్డన్‌సెర్చ్, వెహికల్ చెకింగ్ విస్తృతంగా నిర్వహించారు. గతంలో నాటుసారా తయారుచేసే ప్రదేశాలతో పాటు, అనుమానిత ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. రికార్డ్ అండ్ నెంబర్‌లేని ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 12 కేసులు నమోదు చేసి, 19 మందిని అరెస్టు చేశారు. అలాగే 110.5 లీటర్ల సారాను, 180 ఎంఎల్ 12 మద్యం బాటిళ్లు, 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ నాటు సారా వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ చట్టం ప్రయోగించడానికీ వెనుకాడబోమని హెచ్చరించారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ధవళేశ్వరం: చెలరేగుతున్న గంజాయి, బ్లేడ్ బ్యాచ్, రౌడీ మూకలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా వీరి కదలికలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించారు. గురువారం ధవళేశ్వరంలోని టిడ్కో గృహాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానాస్పద వ్యక్తుల వద్ద ఉన్న 25 వాహనాలను గురువారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల గంజాయి కేసుల్లో పలువురిని పోలీసులు కటకటాల వెనక్కు పంపారు. వీరిలో కొందరు ఇటీవల బెయిల్‌పై తిరిగిరావడంతో, పోలీసులు నిఘా పెంచారు. ధవళేశ్వరం టిడ్కో హౌస్‌ల కేంద్రంగా ఈ బ్యాచ్‌ల కార్యకలాపాలు పెరిగాయన్న సమాచారంతో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాత్రి కూడా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు సుమారు 60 మంది పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నారు. గ్రామంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్, రౌడీ మూకల ఆగడాలను ఉపేక్షించేది లేదని సీఐ కె.మంగాదేవి హెచ్చరించారు. వీరి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు.

ఉమా మార్కండేయేశ్వర స్వామి ధర్మ ప్రచార వారోత్సవాలు

రేపటి నుంచి ప్రారంభం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం, సమాజంలో ఆధ్యాత్మిక ఐక్యత కోసం, భక్తుల చెంతకే భగవంతుడి దర్శనభాగ్యం కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నెల 4 నుంచి ఉమా మార్కండేయేశ్వర స్వామి వారి ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాజమహేంద్రవరంలోని గోదావరి గట్టు వద్ద ఉన్న ఉమా మార్కండేయేశ్వర స్వామి వారి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాల వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవాదాయ, ధర్మదాయ శాఖ, ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 10 వరకూ ధర్మ ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 4న స్టేడియం రోడ్డులోని మంగళవారపుపేటలో, 5న పాత నామవరం సెంటర్‌లో, 6న అప్సర థియేటర్ వద్దనున్న శ్యామలాంబ దేవాలయం వద్ద, 7న రాజానగరంలోని తూర్పుగానుగోడెం, 8న వీఎల్ పురంలోని దుర్గాదేవి ఆలయం, 9న అన్నపూర్ణపేట రామాలయం వీధిలో, 10న రెల్లిపేటలోని కుంచెమాంబ ఆలయం వద్ద స్వామి వారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని వివరించారు. భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.



ఉమామార్కండేయేశ్వర స్వామి వారి ఆలయం

పీడీఎస్ బియ్యం పట్టివేత

మధురపూడి: రేషన్‌కార్డు దారుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, కార్మికులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్న వ్యాపారిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన ఇంటిపై కోరుకొండ మండలం నర్సాపురంలో గురువారం దాడి చేశారు. రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో ఓ ఇంట్లో 10 గోనె సంచుల్లో 500 కేజీల పీడీఎస్ బియ్యాన్ని దాచినట్టు గుర్తించారు. దీని విలువ రూ.20,500గా లెక్కించారు. బియ్యాన్ని సీజ్ చేసి, 6ఏ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని దాచిన కొయ్య రవిబాబుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుకొండ పోలీసులకు సిఫార్సు చేశారు.

సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్

వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. గురువారం తొర్రేడు గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో నిర్మించిన చిక్కాల కుమార్ ఇంటి గృహప్రవేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిక్కాల కుమార్ దంపతులను ఆమె ఆశీర్వదించారు. ఆమె మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 31 లక్షల అక్క, చెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు, ఇళ్ల నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకున్నారని వివరించారు. జగనన్న కాలనీలో స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కోరారు. తొర్రేడు సొసైటీ చైర్‌పర్సన్ చిట్టూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



గృహ ప్రవేశానికి హాజరైన జక్కంపూడి విజయలక్ష్మికి పుష్పగుచ్ఛం ఇస్తున్న చిక్కాలకుమార్ దంపతులు

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రకాశం నగర్: నన్నయ యూనివర్సిటీ పరిధిలోని అంతర్ డిగ్రీ కళాశాలల కబ్బడ్డీ పోటీలు గురువారం స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. హయ్యర్ ఎడ్యుకేషన్ ఫర్ జోన్-1, 2 రీజనల్ జాయింట్ డైరెక్టర్ సి.కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈ పోటీల్లో మొత్తం 20 జట్లు తలపడుతున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో ఎంపికైన జట్లు ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయన్నారు. అకడమిక్ డీన్ పి.సురేష్, కళాశాల క్రీడా విభాగాధిపతి ఎం.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'లో వైద్య విద్యార్థుల పరిశీలన

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కంబాలచెరువు యూపీహెచ్‌సీ వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో రాజమండ్రి ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్, మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోజ్ ఈ వివరాలను తెలిపారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఫీల్డ్ వర్క్‌లో భాగంగా వైద్య విద్యార్థులను జగనన్న సురక్ష వైద్య శిబిరంలో వివిధ అంశాల పరిశీలన చేశారని చెప్పారు. శిబిరానికి వచ్చే రోగులు, వారికి ఎలాంటి మందులు అవసరం, శిబిరంలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి తదితర వాటిని వైద్య విద్యార్థులు క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష వైద్య శిబిరాలకు వైద్య కళాశాలలోని సుమారు 150 మంది విద్యార్థులు బ్యాచ్‌ల వారీగా హాజరవుతున్నారని తెలిపారు.



ఆరోగ్య శిబిరం పరిశీలనకు హాజరైన వైద్య విద్యార్థులు

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలు గురువారం స్థానిక గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి, క్రీడా సమాఖ్య అధ్యక్షులు ఎస్.అబ్రహం, ఉప విద్యాధికారి నారాయణరావు ముఖ్య అతిథులుగా హజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ క్రీడాకారులు మంచి ప్రతిభ చూపించి రాష్ట్రస్థాయిలో ఆడాలని ఆకాంక్షించారు. స్కూల్ ఫెడరేషన్ కార్యదర్శి కెవీ స్వామి, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు జెవివి అప్పారెడ్డి, కోశాధికారి కె. సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అసోసియేషన్ కార్యదర్శి వీటీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఇసుక వ్యాపారి మృతి

రాజానగరం: సీతానగరం ఏటిగట్టుపై గురువారం మధ్యాహ్నం ఆటో ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి చనిపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. వంగలపూడికి చెందిన పిటకా వీరవెంకట సత్యనారాయణ(34) గోదావరి ఇసుకను ఎడ్లబండిపై సరఫరా చేస్తుంటాడు. ఇసుక సొమ్ము వసూలు చేసుకుని సీతానగరం నుంచి బైక్‌పై తిరుగు పయనమయ్యాడు. వంగలపూడి మార్గంలోని శింగవరంలో ఓ ఫంక్షన్‌కు వెళ్తుండగా, ఏటిగట్టుపై అతడి బైక్‌ను ఎదురుగా వచ్చిన కూరగాయల ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు

శ్యామల	: మాఊరి పొలిమేర-2
సూర్యమినీ	: కవివీరుడు
సూర్యప్యాలెస్	: నరకాసుర
స్వామి	: టైగర్ నాగేశ్వరరావు
శివజ్యోతి	: మాఊరి పొలిమేర-2
అనుశ్రీ	: భగవంత్ కేసరి
రాజా	: భగవంత్ కేసరి
అశోక	: భగవంత్ కేసరి
ఊర్వశి	: కీడాకోలా
రంభ	: విధి
మేనక	: మ్యాడ్
అప్సర	: లియో
నామవరం	
వీఎస్.మహల్	: కీడాకోలా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మాఊరి పొలిమేర-2
కడియం	
వెంకటసూర్య	: కీడీకోలా, నరకాసుర